క్లుప్తంగా

పాఠశాలకు వితరణ



కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అశ్వాపురం: మండలపరిధిలోని నెల్లిపాక బంజర జెడ్పీ ఉన్నత పాఠశాలకు 1986–87 సంవత్సరం పూర్వ విద్యార్థులు మంగళవారం రూ.42,500 విలువ గల కంప్యూటర్, ప్రింటర్‌ను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పంపన మధు, కందూరు శ్రీనివాసరెడ్డి, మిట్టకంటి వెంకటరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఓబిలినేని మురళీకృష్ణ, సిద్దారెడ్డి, శారద, రమాకుమారి, సత్యనారాయణ, హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నియామకం



కన్వీనర్, కో–కన్వీనర్లను సన్మానిస్తున్న గోపి

మణుగూరు టౌన్: రాష్ట్ర పంచాయతీ పరిషత్ పినపాక కన్వీనర్‌గా అత్తరున్నీసాను నియమిస్తూ రాష్ట్ర పరిషత్ చైర్మన్ ఎంఏ.జలీల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా కో కన్వీనర్‌గా కె.వసంత, మహిళా విభాగం మణుగూరు మండల కన్వీనర్‌గా పూనెం సరోజ, కో కన్వీనర్‌గా బొడ్డు సౌజన్యను నియమించారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారిని నాయకులు గురజాల గోపి స్థానిక కార్యాలయంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటింటికి మొక్కలు పంపిణీ



మొక్కలు అందజేస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలపరిధిలోని గుమ్మడవల్లి పంచాయతీ కొత్తూరు గ్రామంలో మంగళవారం పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వనమహోత్సవంలో భాగంగా ఇంటికి ఆరు మొక్కలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది గ్రామస్తులకు మొక్కలు నాటి సంరక్షించుకోవాలని కోరారు.

లబ్ధిదారులకే ఇసుక కూపన్లు ఇవ్వాలి

గుండాల: మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను నేరుగా లబ్ధిదారులు కట్టుకునేలా ప్రోత్సహించాలని, ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కూపన్లను అధికారులు లబ్ధిదారులకే నేరుగా అందజేయాలని గుండాల మాజీ సర్పంచ్ కొమరం సీతారాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లను కాంట్రాక్టర్‌కు ఇస్తే నాసిరకంగా కడుతున్నారన్నారు. ప్రభుత్వం ముగ్గులు పోసిన ఇందిరమ్మ లబ్ధిదారులకు ముందుగానే లక్ష రూపాయలు బిల్లు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇసుక కష్టాలు తీర్చాలి..

అశ్వాపురం: మండలంలో నిరుపేదలు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కష్టాలు తీర్చాలని సీపీఎం నాయకులు దండి రాములు కోరారు. మండల పరిధిలోని మల్లెలమడుగులో ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరతతో లబ్ధిదారులు ఒక్కో ఇసుక ట్రాక్టర్ రూ.3 వేలకు కొనుగోలు చేస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని సీతాయిగూడెంలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ఆరోగ్య, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది హారిక, భవాని, రామదాసు, నారాయణమ్మ, పద్మ, వెంకటలక్ష్మి ఉన్నారు.

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చినరాయిగూడెం, విప్పలగుంపులో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు నిశాంత్‌రావు, సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ... పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు నిల్వ ఉన్న నీటిని తొలగించారు. వీరాస్వామి, హెల్త్ అసిస్టెంట్లు కృష్ణ, వెంకటలక్ష్మి, రాంప్రసాద్, కౌసల్య, జయమ్మ, ప్రియాభారతి తదితరులు ఉన్నారు.

తీర్మానాలకే పరిమితమాయె!

గడువు ముగిసినా షాపింగ్‌కాంప్లెక్స్‌లను ఖాళీ చేయని వైనం

- ఏళ్లుగా కొందరి ఆధీనంలోనే..
- ఖాళీ చేయాలని రెండు సార్లు తీర్మానం
- నోటీసుల జారీలో మీనమేషాలు



భద్రాచలం మార్కెట్ కమిటీ కార్యాలయం

భద్రాచలంటౌన్: భద్రాచలం వ్యవసాయ మార్కెట్‌లో తరుచూ ఏదో ఒక వివాదంతో వార్తల్లో నిలుస్తోంది. మార్కెట్‌లో విధులు నిర్వహిస్తున్న సెక్రటరీ ఒక వివాదంలో చిక్కుకుని సస్పెండ్ కావడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ మధ్య మార్కెట్ కమిటీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ రచ్చ జరుగుతోంది. చర్ల రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 2003 సంవత్సరంలో 21 షాపులతో కాంప్లెక్స్ నిర్మాణానికి నిర్ణయించారు. షాపుల నిర్మాణానికి ముందుగానే వ్యాపారుల నుంచి రూ.46 వేలు డిపాజిట్ కట్టించుకున్నారు. వీరికే 20 ఏళ్ల పాటు కాంప్లెక్స్‌లోని గదులకు అద్దెకు కేటాయించి, 20 ఏళ్ల తర్వాత ఖాళీ చేయాలనే నిబంధన విధించారు. కానీ గడువు ముగిసిన వారే కొనసాగుతుండడంపై మార్కెట్ నూతన కమిటీలోని సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇటీవల పాలకవర్గ సమావేశంలో షాపులను ఖాళీ చేయించేలా నోటీసులు జారీకి తీర్మానించారు. కానీ, కారణాలేమిటో తెలియదు కానీ నోటీసులు జారీ చేయడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

తీర్మానం చేసింది వాస్తవమే...

భద్రాచలం మార్కెట్‌కు సంబంధించిన షాపుల గడువు ముగియడంతో వారితో చేసుకున్న అగ్రిమెంట్‌ను రద్దుచేస్తూ పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేశాం. గతంలో ఏమి జరిగిందో నాకు తెలియదు. జిల్లా మార్కెటింగ్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. మార్కెట్‌కు ఆదాయం పెరిగేలా పాలకవర్గం నిర్ణయం తీసుకుంటుంది.

– తెల్లం సీతమ్మ, మార్కెట్ చైర్‌పర్సన్

నోటీసులను అడ్డుకుంటున్నదెవరు?

భద్రాచలం మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం మొదటి సమావేశం 2024 డిసెంబర్ 14న జరిగింది. ఈ సమావేశంలోనే తీర్మానం చేసి నెలలు గడుస్తున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పాలకవర్గం మళ్లీ ఈనెల 15న జరిగిన పాలకవర్గ సమావేశంలో మరోసారి తీర్మానం చేశారు. కానీ అధికారులు రోజులు గడుస్తున్నా నోటీసులు జారీ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. షాపులను అద్దెకు తీసుకున్న వారికి నోటీసులు జారీ చేయకుండా అడ్డుకునే విషయంలో ఓ మాజీ జెడ్పీటీసీ తీవ్రంగా శ్రమిస్తున్నట్లు తెలుస్తుంది. స్థానిక ఎమ్మెల్యేతో పాటు కమిటీ చైర్మన్‌తో సన్నిహితంగా ఉండే అతను షాపులను అద్దెకు తీసుకున్న యజమానులతో భారీ ఒప్పందం కుదుర్చుకుని వారికే మళ్లీ షాపులను దక్కించే విధంగా అధికారులను సైతం ప్రభావితం చేస్తున్నాడని ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో కమిటీ పాలకవర్గ సభ్యులను సైతం ప్రభావితం చేసేందుకు ప్రయత్నించగా వారు వ్యతిరేకించడంతో వారిపై ఎమ్మెల్యేకు సైతం తప్పుగా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో పాలకవర్గ సభ్యులు త్వరగా షాపులను ఖాళీ చేయించాలని అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం.

కొత్త వారొస్తేనే లాభం..

కమిటీ కాంప్లెక్స్‌ల్లో ఉండే వారు నెలకు రూ.5,300 చెల్లిస్తున్నారు. వీరికి కేటాయించిన గడువు ముగిసిన మళ్లీ వారికే షాపులను కట్టబెట్టడంతో అద్దె చెల్లింపుల్లో పెద్దగా మార్పు రాలేదు. పాలకవర్గం వారితో చేసుకున్న మరో ఏడాది పెంచుతూ అధికారులు హడావుడిగా చేసిన ఒప్పందం రద్దు చేస్తూ తీర్మాణం చేశారు. ఈ క్రమంలో పాతవారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తే అద్దె సైతం పెరిగే అవకాశాలు ఉన్నట్లు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అద్దెకు తీసుకున్న వారు సైతం వేరే వారికి మళ్లీ అద్దెకు ఇచ్చుకుని రెండింతలు పొందుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేసి షాపులను ఖాళీ చేయించి స్థానిక ఆదివాసీ యువతకు అవకాశం కల్పించాలని పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా మార్కెటింగ్ అధికారి, భద్రాచలం ఇన్‌చార్జ్ సెక్రటరీ నరేంద్రను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

సమృద్ధిగా యూరియా నిల్వలు

- ఏడీఏ రవికుమార్



మాట్లాడుతున్న ఏడీఓ రవికుమార్

ములకలపల్లి: యూరియా ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఈవిషయంలో రైతులు ఎలాంటి అపోహలకు గురికావొద్దని అశ్వారావుపేట ఏడీఏ పి.రవికుమార్ స్పష్టం చేశారు. మండలకేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో విక్రయిస్తున్న ఎరువుల కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. నానోయూరియా ద్రావణం వినియోగంపై అవగాహన కల్పించారు. యూరియా కొరత ఉందన్న వస్తున్న పుకార్లను విశ్వసించవద్దన్నారు. దుక్కుల్లో మాత్రమే యూరియా గుళికలను వేయాలని, నానోయూరియా ద్రావణం పిచికారీ చేయడంతో పంటకు బలం లభించి, ఏపుగా పెరుగుతాయన్నారు. అరలీటర్ బాటిల్ ఒక యూరియా బస్తాలతో సమానంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ అరుణ్‌బాబు, సీఈఓ కుంచారపు శ్రీనివాసరావు, ఏఈఓ రాహుల్, గోడౌన్ ఇన్‌చార్జి బొమ్మకంటి కామేశ్, సీహెచ్ మురళి, నాగేందర్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆస్పత్రిలో ఏసీబీ రైడని ప్రచారం..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించినట్టుగా మంగళవారం పట్టణంలో ప్రచారం నడిచింది. కాగా ఇదే విషయంపై భద్రాచలం ఇంటలిజెన్స్ పోలీసులు ఏరియా ఆస్పత్రికి వెళ్లి అక్కడ అధికారులను స్వయంగా కలిసి ఆరా తీశారు. ఈ మేరకు సదరు ఇంటలిజెన్స్ పోలీసులను వివరణ కోరగా రైడ్స్ అంటూ వచ్చిన వార్త అవాస్తవమన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీకి సిద్ధంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన రేషన్‌కార్డుల పంపిణీకు డీలర్లు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ సీహెచ్‌వీ.రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయన మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. కార్డులను రేషన్ దుకాణాల వారిగా కేటాయించామని, ఈ నెల 25 తర్వాత లబ్ధిదారులకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మంజూరుపత్రాలను అందిస్తామన్నారు. డీటీ ఎస్‌కే.హుస్సేన్, సిబ్బంది వెంకన్న, రేషన్‌డీలర్లు ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడటమే లక్ష్యం

దమ్మపేట: ప్రజల కోసం అనునిత్యం పోరాడే ఏకైక పార్టీ సీపీఐ అని పార్టీ జిల్లా కార్యదర్శి షాబీర్‌పాషా అన్నారు. మంగళవారం దమ్మపేట మార్కెట్ యార్డులో పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ, ప్రజా సమస్యలపై అవగాహనతో పోరాడటమే పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం దమ్మపేట మండల కార్యదర్శిగా సుంకిపాక ధర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా 28 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నరాటి ప్రసాద్, ఎస్‌డీ.సలీం, సుంకిపాక ధర్మ, బత్తుల సాయి పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లిలో కస్తూర్బా గాంధీ జూనియర్ కాలేజీలో అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్‌ఓ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింగ్ అధ్యాపక పోస్టు ఖాళీగా ఉందని, ఈ పోస్టును ఒప్పంద పద్ధతిలో భర్తీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఉండాలని, నర్సింగ్, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డ్ జిరాక్స్ పత్రాలను బుధవారం సాయంత్రం4 లోపు భట్టుపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో అందజేయాలని కోరారు.

ముత్యాలమ్మ పండుగ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ప్రతీ రెండేళ్లకొక్కసారి నిర్వహించే గ్రామ పండుగలు పోలమ్మ, మరిడమ్మ, ముత్యాలమ్మ పండుగలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ముత్యాలమ్మ ఆలయం దగ్గర ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూజ మందిరం వద్ద డప్పు, సన్నాయి వాయిద్యాలతో శివసత్తులు నృత్యాలు చేశారు. అఖండ జ్యోతిని గ్రామ పురవీధుల్లో అమ్మోరు తల్లులు అంగరంగ వైభవంగా ఊరేగించి భక్తుల ఇంట పూజలు చేశారు. ఊరేగింపులో ఏర్పాటు చేసిన భేతాళసెట్టు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. జాతర కమిటీ అధ్యక్షుడే గడ్డ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు హరిబాబు, గోసుల వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, అప్పన్న, తాతారావు, అంజి, రాము, రాంబాబు,సుధాకర్, హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ వాయిదా

భద్రాచలంటౌన్: మండలంలో రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదావేసినట్టు తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్‌లో ఎమ్మెల్యే చేతుల మీదుగా రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు, త్వరలో మరో తేదీని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

వ్యర్థాలను డ్రైయినేజీల్లో వదలొద్దు..



మాట్లాడుతున్న కమిషనర్ నాగరాజు

అశ్వారావుపేటరూరల్: సెప్టిక్‌ట్యాంక్‌ల నుంచి తొలగించే వ్యర్థాలను పట్టణంలోని డ్రైనేయిజీలు, జనవాసాల్లో వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బి.నాగరాజు హెచ్చరించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో సెప్టిక్‌ట్యాంకర్ల ఓనర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టిక్ ట్యాంకర్లలో లోడ్‌వేసిన వ్యర్థాలను ఊరికి దూరంగా, ఎవరికి ఇబ్బంది లేకుండా పోయాలని, అలాగే ట్యాంకర్ల నుంచి లీకేజీలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా ట్యాంకర్లను నడిపే వారికి తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, బీమా, పొల్యూషన్, రోడ్ ట్యాక్స్‌తోపాటు మున్సిపాలిటీ పరిధిలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించి ఉండాలని ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టాలి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో దృష్టి సారించి, నిర్మాణాలను వేగవంతం చేయించాలని ఎంపీడీవో బీరబెల్లి అప్పారావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించి నిర్మాణాలు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. హౌసింగ్ ఏఈఈ మదన్‌మోహన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ కవి దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్‌ఎం హరిత అధ్యక్షతన జయంతోత్సవ సభ నిర్వహించగా, ముందుగా దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పుల్లయ్య, దుర్గయ్య, ప్రభాకరాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షంతో నీట మునిగిన వీధులు

మణుగూరు టౌన్: మూడున్నర గంటల పాటు మంగళవారం కురిసిన భారీ వర్షం కారణంగా మున్సిపాలిటీలోని పలు వీధులు నీట మునగగా, మండలంలోని డ్రెయినేజీలో నీరు పారక అశోక్‌నగర్‌లోని ఓ వీధి పూర్తిగా వరద నీటితో జలదిగ్బంధమయ్యింది. మున్సిపాలిటీలోని గాంధీనగర్‌లో పలు ఇళ్లు వరదకు నీట మునగగా, శ్రీశ్రీ నగర్‌లోని కాల్వ పొంగి రోడ్డుపైకి వరద నీరు ప్రవహించింది. వినాయకనగర్ అంతర్గత రోడ్లు నీట మునిగి ప్రజలు నివాసాల్లోనే ఉండిపోయారు. ముత్యాలమ్మనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల వీధి వరద నీరు నిలిచి జలమయమైంది. సమితిసింగారం పంచాయతీ సమీపంలోని ఓ బీటీ రోడ్డుపై వరద చెరువును తలపించింది. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడినట్లు అధికార వర్గాలు తెలిపాయి.



మణుగూరు టౌన్: ఓ వీధిలోకి చేరిన వరద

అశ్వారావుపేటరూరల్: కొద్ది రోజులుగా రైతన్నలు వర్షం కోసం పడిగాపులు కాస్తున్న నేపథ్యంలో మంగళవారం అశ్వారావుపేట మండల వ్యాప్తంగా జోరు వర్షం కురిసింది. గంటల కొద్ది ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో పంటలకు ప్రాణం పోయగా, అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.

సమగ్ర అభివృద్ధే లక్ష్యం..

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారె

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని లింగాలపల్లి, రామచంద్రాపురం, నాగుపల్లి, నాచారం, గుండెపట్వారిగూడెం, అంకంపాలెం, తాటిసుబ్బన్నగూడెం, చలమప్పగూడెం తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో రూ.8 కోట్ల 42 లక్షల వ్యయంతో నిర్మితమైన బీటీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గిరిజన గ్రామాలను బీటీ రోడ్లతో అనుసంధానం చేసి, తద్వారా రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తున్నామన్నారు. నాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, హాజరు పట్టికలను పరిశీలించి, హెచ్‌ఎంకు తగు సూచనలు చేశారు. నాచారం గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను, స్థానిక నాయకులతో కలసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రారెడ్డి, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఎంపీఓ రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాగర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



దుమ్ముగూడెం: కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

దుమ్ముగూడెం: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, తహసీల్దార్ అశోక్ కుమార్, ఎంపీడీఓ వివేక్ రామ్, గిర్దావర్ వెంకటేశ్వరరావు, నర్సింహారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వర కల్యాణంలో ఎమ్మెల్యే దంపతులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని సీతారామనగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం పునర్నిర్మాణం చేసి 40 రోజులయిన సందర్భంగా ఆలయంలో శాంతి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు. అర్చకుడు ఆరుట్ల నారాయణాచార్యులు, వెంకట పుల్లారావు, అడబాల సత్యనరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

- కళాశాల ఘటనపై విచారణ జరిపించాలి..



వినతిపత్రం అందజేస్తున్న పేరెంట్స్ కమిటీ

భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో జరిగిన ఘటనపై మరోసారి విచారణ చేపట్టాలని కళాశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, భద్రయ్యలు ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ ఘటన విద్యార్థినుల చదువుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, మరోసారి విచారణ జరిపించి ప్రిన్సిపాల్, వార్డెన్‌లపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. ప్రకాష్, స్వరూప, పద్మ ఉన్నారు.

- ఇసుక, గ్రావెల్‌కు అనుమతులివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అశ్వాపురం: మండలంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, గ్రావెల్‌కు అనుమతులివ్వాలని మాజీ ఎంపీటీసీ కమటం నరేష్ ఆధ్వర్యంలో మొండికుంట గ్రామ కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ మణిధర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మారోజు కృష్ణమాచారి, పర్వత నరేష్, ముప్పు మహేష్, చిన్నూరి వీరభద్రం, ఉపేందర్, నరేష్, వెంకటేష్ ఉన్నారు.

- ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

దమ్మపేట: మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామ శివారులో ఉన్న చింతలచెరువు అలుగు కాల్వను ఆక్రమించుకున్న ఓ రైతుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఆయకట్టు రైతులు స్థానిక నీటి పారుదల శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రంగారావు, రామచంద్రరావు, కుమారస్వామి, వెంకటేశ్వరరావు ఉన్నారు.

- బంక్ నిర్మాణం ఆపాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అనుమతులు లేకుండా దమ్మపేట బస్టాండ్‌లో నిర్మిస్తున్న పెట్రోల్‌బంక్ నిర్మాణాన్ని ఆపాలని పంచాయతీ కార్యదర్శి సంజీవరెడ్డికి గ్రా మస్తులు వినతిపత్రం అందజేశారు. సత్యంబాబు, రహీం, రామారావు, శ్రీను, వెంకటేశ్వరరావు ఉన్నారు.

- వీధి కుక్కల నుండి రక్షించండి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో వీధికుక్కల నుండి ప్రజలను రక్షించాలంటూ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు మంగళవారం పట్టణ ప్రజలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... మంగళవారం పట్టణంలోని ఓ విద్యార్థినిపై దాడి చేసి గాయపరిచాయని, సోమవారం ఒక్కరోజే ముగ్గురిపై కుక్కలు దాడి చేసిన ఘటన ప్రజలను భయాందోళనకు గురిచేస్తుందన్నారు. తక్షణమే వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు మొదలు పెట్టాలన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి



మాట్లాడుతున్న రఘుపతిరావు

చంద్రుగొండ: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని బీజేపీ మండలాధ్యక్షుడు నల్లమోతు రఘుపతిరావు అన్నారు. మంగళవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పంచాయతీలతోపాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు బరిలో ఉంటారన్నారు. నరేంద్రబాబు, గుగులోతు రాజేష్, కుమార్‌నాయక్, భోగి కృష్ణ, రాంపండు, గుగులోతు రాంబాబు, రామారావు, సావిత్రి, జంగా సత్యనారాయణరెడ్డి, జ్యోతి, అనూష ఉన్నారు.

వినయమే విద్యార్థుల ఉన్నతికి మూలం

భద్రాచలంటౌన్: విద్యార్థులు జీవితంలో రాణించాలంటే విద్య, దృఢ సంకల్పం, వినయ గుణాలే మూలమని తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ అన్నారు. పట్టణంలోని రాజుపేట కాలనీలో మోడల్ స్కూల్‌లో 'ప్లేపార్క్' ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయంగా వస్తున్న శాస్త్ర సాంకేతిక రంగాలలోని మార్పులను అధ్యయనం చేసి మానవాళి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య మాట్లాడుతూ.. విద్యతోపాటు సత్యం, ధర్మం, న్యాయం మార్గాలలో నడవాలన్నారు. ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, కవి చిగురుమళ్ల శ్రీనివాస్, కరస్పాండెంట్ ఉషారాణి, దుమ్ముగూడెం ఎంఈఓ సున్నం సమ్మయ్య, శ్యామ్, ప్రభాకర్, లక్ష్మి, లీలావతి, సిద్ధులు, మాధవరెడ్డి, అశోక్, లలిత తదితరులు పాల్గొన్నారు.

వీఎస్ అచ్యుతానందన్‌కు ఘన నివాళి

కేరళ మాజీ సీఎం, సీపీఎం జాతీయ నాయకుడు వీఎస్.అచ్యుతానందన్ మృతిపై సీపీఎం నాయకులు తీవ్రసంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. – సాక్షి నెట్‌వర్క్



మణుగూరు రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



చంద్రుగొండలో..



దమ్మపేటలో..



చర్లలో..